అచ్చంపేటలో ట్రా'ఫికర్'

- పట్టణంలో పార్కింగ్‌కు స్థలం కరువు
- అంబేడ్కర్ చౌరస్తా, పాత బజార్‌లో తీవ్ర సమస్య



అచ్చంపేటలోని పాతబజార్‌లో రోడ్డుపైనే వ్యాపారాలు

అచ్చంపేట రూరల్: ప్రభుత్వాలు మారినా పాలకులు మారినా పట్టణంలో ట్రాఫిక్ సమస్య మాత్రం మారడం లేదు. రోజురోజుకు వాహనాల సంఖ్య పెరుగుతున్నా దానికి తగిన విధంగా ముందుచూపుతో ప్రణాళికలు వేయకపోవడంతో ట్రాఫిక్ సమస్య పట్టణవాసులను వేధిస్తోంది. పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలను పార్కింగ్ చేయక తప్పడం లేదు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వెళ్లే వాహనాలకు వెళ్లేందుకు దారి ఇరుకుగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద వాహనాలను నిలిపితే ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రతరం అవుతోంది. ప్రణాళిక లోపం, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడటంతో వాహనాల పార్కింగ్ అస్తవ్యస్తంగా ఉంది. పట్టణంలో వాహనాలు నిలపాలన్నా.. నడపాలన్నా పెద్ద సమస్యగా మారింది. పట్టణం దినదినాభివృద్ధి జరుగుతున్నా ఆ స్థాయిలో ట్రాఫిక్ సమస్య తీర్చడానికి వసతులు లేకుండా పోయాయి. ప్రత్యేక పార్కింగ్ జోన్లు లేకపోవడంతో రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలు నిలుపుతున్నారు.

రోడ్డెక్కిన వ్యాపారాలు...

మహబూబ్‌నగర్– శ్రీశైలం, హైదరాబాద్‌కు వెళ్లడానికి ప్రధాన రహదారి పట్టణం నుంచే ఉండటంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పట్టణ పరిధి ప్రారంభం జీఎస్ఎస్ కళాశాల సమీపం నుంచి అటవీశాఖ కార్యాలయం వరకు భారీ పొడవు డివైడర్ ఉన్నా... ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. డివైడర్‌కు ఇరువైపులా ఉన్న రోడ్లపైకి వ్యాపారాలు రావడంతో తీవ్ర సమస్య ఏర్పడింది. తోపుడు బండ్లు, వీధి వ్యాపారులు రోడ్డుకు అతి సమీపంలో వ్యాపారాలు సాగిస్తుండటంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. అలాగే దుకాణదారులు దుకాణంలోని వస్తులను బయట పెట్టడంతో సమస్యకు దారి తీస్తుంది. వాహనాల సంఖ్య పెరగడంతో అక్కడక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

సమస్యాత్మక ప్రాంతాలు ఇవే...

పట్టణంలోని బస్టాండు ఎదురుగా, పాత బజార్‌లో రోడ్డు ఇరుకుగా ఉండటం, అక్కడే వివిధ వాహనాలు పార్కింగ్ చేయడంతో అటుగా వెళ్లాలంటేనే తీవ్ర ఇబ్బందిగా ఉంటుంది. అంబేడ్కర్ చౌరస్తాలో సమస్య తీవ్రంగా ఉంది. అక్కడే దుకాణాల ముందు భారీ వాహనాలు నిలపడం, లింగాల షటిల్ బస్సు అక్కడే యూ టర్న్ తీసుకుని వెళ్లడంతో వాహనాలు భారీగా నిలిచి పోతున్నాయి. నిత్యం ఈ తంతు ఇలా జరుగుతున్నా...ఆయా శాఖల అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పాత బజార్‌లోని వివిధ షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా వాహనాలు నిలపడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఉప్పునుంతల రోడ్డు, లింగాల రోడ్డు, రాజీవ్‌చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, నెహ్రూ చౌరస్తా వంటి ప్రాంతాల్లో సమస్యాత్మకంగా ఉన్నాయి. రోడ్డుపై వాహనాలను నిలిపి షాపింగ్ చేయడంతో ఇతర వాహనాలు వెళ్లలేకపోవడంతో ట్రాఫిక్‌జాం అవుతుంది.

సమస్య తీరేనా...

గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సాహసం చేసి అంబేడ్కర్ చౌరస్తాలో, ఆస్పత్రి ఎదుట డబ్బాలు తొలగించారు. కొంత వ్యతిరేకత వచ్చినా అక్కడి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తీరింది. ప్రస్తుతం అంబేడ్కర్ చౌరస్తాలోని పోస్టాఫీసు చుట్టూ పండ్ల వ్యాపారులు, ఇతరులు కబ్జా చేసుకుని దర్జాగా రోడ్డుపైనే వ్యాపారాలు చేస్తున్నారు. అక్కడ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బస్సులు రోడ్డుపైనే నిలపడటంతో ట్రాఫిక్ జాం తలెత్తుతోంది. పాత బజార్‌లోనూ అదే సమస్య. పట్టణం దాటి వెళ్లాలంటే అరగంట సమయం పడుతుంది. అక్కడక్కడ ప్రధాన రహదారిపై, చౌరస్తాలో పోలీసులు ఉన్నప్పటికీ సమస్య అలాగే ఉంది. శ్రీశైలం మల్లన్న దర్శనానికి వెళ్లే వీఐపీలు, ఉన్నతాధికారులు అచ్చంపేట ట్రాఫిక్ జాంను చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. గతంలో అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు తీవ్రంగా ఉన్న ట్రాఫిక్ సమస్యను పట్టించుకోలేదని ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత ప్రజాప్రతినిధులు ఆరోపణలు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు ట్రాఫిక్ సమస్యపై ఏ విధంగా స్పందిస్తారోనని పట్టణ ప్రజలు, వాహనదారులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరి బాధ్యత ఉన్న అధికారులైనా స్పందించి ట్రాఫిక్ జాంను నివారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రణాళిక రూపొందిస్తున్నాం



పట్టణంలోని ట్రాఫిక్ సమస్యను తీర్చేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నాం. సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులతో చర్చించాం. రోడ్లపైన ఆటోలు, ఇతర వాహనదారులకు నిలపకుండా డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. వ్యాపారాలు రోడ్లపైన చేయకుండా చర్యలు చేపడుతాం. ఇష్టానుసారంగా వాహనాలు నిలిపితే జరిమానాలు విధిస్తాం.

– రవీందర్, సీఐ, అచ్చంపేట

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వినతి



కలెక్టర్ ఏఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న కేవీపీఎస్ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: బిజినేపల్లి మండలం నందివడ్డెమాన్ పంచాయతీ పరిధిలోని ఆవులోనికుంట శిఖం భూమిని ఆక్రమించి అలుగును తొలగించిన ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఓ చంద్రశేఖర్‌కు కేవీపీఎస్ నాయకులు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు అంతటి కాశన్న మాట్లాడుతూ రియల్‌ఎస్టేట్ వ్యాపారి వేముల శ్రీనివాసులు చెరువు శిఖం భూమిని ఆక్రమించారన్నారు. ఈ విషయమై పోలీసులకు, రెవెన్యూ అధికారులకు, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసిన సమస్యను పట్టించుకోవడం లేదని వివరించారు. కార్యక్రమంలో వీరస్వామి, సుదర్శన్, శ్రీనివాస్, రత్నయ్య, సుబ్బయ్య, శేఖర్, రమేష్, రాములు, లక్ష్మయ్య, శాంతయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సంత వేలం రూ.3.15 లక్షలు



చారకొండలో సంత వేలం నిర్వహిస్తున్న అధికారులు

చారకొండ: మండల కేంద్రంలో ప్రతి శనివారం జరిగే గొర్రెల, మేకల సంత వేలాన్ని గురువారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వచ్చే సంవత్సరం మార్చి నాటికి 9 నెలలకు సంబంధించి వేలంను నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎరుకలి గణేష్ రూ.3.15 లక్షలకు వేలంపాట పాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి గణేష్ తదితరులు ఉన్నారు.

16న వేలం పాట

చారకొండ: మండలంలోని జూపల్లిలో గొర్రెల, మేకల సంత వేలాన్ని ఈనెల 10న నిర్వహించగా వేలంలో గ్రామ పంచాయతీ నిర్ణయించిన మేరకు ధరావత్ రాకపోవడంతో సంత వేలాన్ని వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి వినోద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 16న బహిరంగ వేలం పాట నిర్వహిస్తునట్లు ఆసక్తి గలవారు ఈనెల 15 వరకు జూపల్లి పంచాయతీ పేరున రూ.50 వేల డీడీ చెల్లించి పంచాయతీ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ప్రాథమిక నైపుణ్యాలపై ఉపాధ్యాయులకు శిక్షణ

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులకు ప్రాథమిక నైపుణ్యాలపై బోధించే విధానంపైన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాథమిక పాఠశాలలో ఇంగ్లీష్ బోధిస్తున్న ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. పిల్లలకు స్పెల్లింగ్ నియమాలు, ప్రత్యామ్నాయ స్పెల్లింగ్‌లను పలికేటప్పుడు స్వతంత్రంగా పదాలను డీకోడ్ చేయడంలో సహాయపడే అంశాలపైన అవగాహన కల్పించారు. శిక్షకులు డా హిరాన్‌బగాడియా, అంజలిసేత్, జయేష్ట, గౌరిసుమంత్ ఉన్నారు.

కొల్లాపూర్: ఆంగ్ల సబ్జెక్టు బోధన అంశాలపై డివిజన్ పరిధిలోని ఉపాధ్యాయులకు పట్టణంలో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. శిక్షణ తరగతులను అకడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫోద్దీన్ సందర్శించారు. జాలీ ఫోనిక్స్ విధానంలో చిన్నారులకు ఆంగ్ల బోధన ద్వారా వారిలో సృజనాత్మకను వెలికి తీయవచ్చని ఆయన అన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు ఉన్నారు.

తాడూరు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జాలిఫోనిక్స్ సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఎంఈఓ భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఇంగ్లీష్ బోధన, ఆవశ్యకత వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. శిక్షణకు సంబంధించిన కిట్లను ఉపాధ్యాయులకు అందజేశారు. శుక్రవారం కూడా శిక్షణ కొనసాగుతుందని ఎంఈఓ తెలిపారు.

పంటల సాగు వివరాల నమోదు

లింగాల: మండలంలోని ఆయా గ్రామాలలో వానా కాలంలో సాగు చేసిన పంటల సాగు వివరాలను గురువారం సూరాపూర్ శివారులో ఏఓ నాగార్జునరెడ్డి, ఏఈఓ చీన్యానాయక్ నమోదు చేశారు. ఏఈఓలో తర క్లస్టర్ పరిధిలోని ఆయా గ్రామాలలో క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలను సేకరిస్తున్నామని ఏఓ తెలిపారు.

ఖననం చేసిన గుంతను తవ్విన మనువడు



ఖననం చేసిన గుంతను పూడుస్తున్న వ్యక్తి

లింగాల: చనిపోయిన వృద్ధురాలి ఆభరణాల కోసం మృత దేహాన్ని ఖననం చేసిన గుంతను తిరిగి తీస్తుండగా పోలీసులు అడ్డుకున్న ఘటన గురువారం కొత్తకుంటపల్లి శివారులో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం గతేడాది కొత్తకుంటపల్లికి చెందిన వృద్ధురాలు లింగమ్మ మృతి చెందింది. కాళ్లకు, చేతులకు వెండి ఆభరణాలు తీయకుండానే ఖననం చేశారు. అయితే వృద్ధురాలి మనువడు తిర్పతయ్య తాగిన మైకంలో ఖననం చేసిన గుంతను తవ్వాడు. ఈ విషయం పోలీసులకు తెలవడంతో ఘటన స్థలానికి చేరుకొని వ్యక్తిని మందలించి తిరిగి గుంతను పూడ్చి వేయించారు.

కుటుంబ నియంత్రణ అందరి బాధ్యత



అచ్చంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అచ్చంపేట రూరల్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్న కుటుంబం– చింతలేని కుటుంబం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ తారాసింగ్ మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ అందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అశోక్‌ప్రసాద్, వైద్యుడు భూపాల్, శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జనాభా పెరగడం ద్వారా కలిగే అనర్థాలపై వైద్యాధికారి సంతోష్ అభిరాం అవగాహన కల్పించారు. అనంతరం బస్టాండ్ నుంచి ఆరోగ్య కేంద్ర వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది లక్ష్మీకుమారి, శ్రీనివాసులు, దాసు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆస్పత్రి నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డా రోహిత్ మాట్లాడుతూ జనాభా నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్ బాలాజీ, ఆశావర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: మండల కేంద్రంలో పీహెచ్‌సీ వద్ద డాక్టర్ మంజుభార్గవి ఆధ్వర్యంలో ఆస్పత్రి నుంచి మండల కేంద్రంలో ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. జనాభాపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సురేందర్, ల్యాబ్ టెక్నిషియన్ శశికుమార్, ఏఎన్ఎం కళమ్మ, స్టాఫ్ నర్సు సంగీత, ఆశాలు సనా, సుమలత, సర్ణలత, గోపమ్మ తదితరులు ఉన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జనాభాపై గ్రామంలో ప్రధాన వీధుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహిస్తూ జనాభాకు నియంత్రణపై నినాదాలు చేశారు. వైద్యాధికారి అనిల్‌కుమార్, వైద్య సిబ్బంది మల్లేష్, భారతి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీసీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

కల్వకుర్తిరూరల్: రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్‌ను కల్వకుర్తి మండలం గుండూరు గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు సురభి వెంకటేశ్వర్‌రావు హైదరాబాద్‌లో శాలువాతో సన్మానించారు. కల్వకుర్తి ప్రాంత బీసీల అభివృద్ధికి సహాయసహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



కల్వకుర్తిరూరల్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యం అని క్లాస్‌మేట్ క్లబ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలిమిచర్ల రమేష్ అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన 19 మంది విద్యార్థులకు నగదు బహుమతి ఇచ్చి సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మీనర్సింహరావు, శోభన్‌బాబు, రాఘవేందర్, డివిజన్ అధ్యక్షుడు రాజేందర్, కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం నిర్మల, సదానందంగౌడ్, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి సరికాదు

కల్వకుర్తి టౌన్: ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిస్టులపై జరిగిన దాడి ఖండిస్తూ గురువారం కల్వకుర్తి డివిజన్ విలేకరులు ఆర్డీఓ శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలియజేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: ఓయూలో నిరుద్యోగుల ఆందోళన కార్యక్రమాన్ని కవరేజ్ చేస్తున్న ఓ న్యూస్ ఛానెల్ ప్రతినిధిపై భౌతిక దాడికి దిగిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే హెచ్ –143 రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చందు నాయక్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజలకు, పాలకులకు వారధిగా నిలిచే జర్నలస్టులపై పోలీసులు అకారణంగా దాడి చేయడం బాధాకరమని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ హైస్కూల్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులకు గురువారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన వీడ్కోలు పలికారు. అదేవిధంగా పాఠశాలలో బాధ్యతలు స్వీకరించిన నూతన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా 10 సంవత్సరాలుగా విద్యార్థులకు పాఠాలు బోధించినట్లు వివరిస్తూ ఉపాధ్యాయులు అర్జున్‌గౌడ్, నర్సింహ, శ్రీనులు భావోద్వేగానికి గురయ్యారు. హెచ్ఎం కురుమయ్య, కుమారస్వామి, శ్రీధర్, నాగయ్య, సరిత, ప్రభావతి పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని దత్తారం ప్రాథమిక పాఠశాలలో 14 ఏళ్లుగా హెచ్ఎంగా పని చేసిన నస్రీన్ బేగం కల్వకుర్తి మండలం సుద్దకల్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మాజీ సర్పంచు జంగమ్మ, విద్యార్థులు హెచ్ఎంను సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి రాజేష్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ కళమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఉప్పునుంతల: ఉప్పునుంతల– జప్తీ సదగోడు రోడ్డు మార్గంలో బుధవారం బోరుబండి, బైక్ ఢీకొన్న ప్రమాదంలో మందుల శ్రీకాంత్ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం విధితమే. ఈ మేరకు గురువారం బాధితుడి సోదరి పెద్దాపూర్‌కు చెందిన తాళ్ల మణెమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బోరుబండి డ్రైవర్ అచ్చంపేటకు చెందిన శ్యాంసుందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుజ్ఞానం తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

వెల్దండ: మండలంలో మైసమ్మ పల్లుతండాలో వ్యవసాయం పొలం వద్ద హద్దులు సక్రమంగా లేవని వడ్యావత్ రాంచంద్ర, వడ్యావత్ దేవేందర్ గురువారం ఘర్షణ పడ్డారు. మాటమాట పెరగడంతో పరస్పర దాడులు చేసుకున్నారు. ఈ మేరకు ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

లింగాల: మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారి మాకం చిన్నరాములు ఇంటిలో చోరీ అయిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల ప్రకారం వ్యాపారి కుటుంబం 9వ తేదీ మంగళవారం తెల్లవారుజామున ఇంటికి తాళాలు వేసి హైదరాబాద్ వెళ్లారు. కాగా ఇంటి మొదటి అంతస్తులో ఉన్న తలుపు తీసి ఉండడం గమనించిన పక్కింటి వారు హైదరాబాద్‌లో ఉన్న వారికి సమాచారం అందించారు. ఈ విషయాన్ని పోలీసులకు వివరించగా ఎస్ఐ జగన్‌మోహన్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు తీసుకున్నారు. రూ. లక్షకు పైగా నగదు, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు తెలుస్తుంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణయ్య

తెలకపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. గురువారం మండలంలోని లక్నారం పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. మెనూప్రకారం భోజనం వడ్డించాలన్నారు. పాఠశాలలో డిజిటల్ తరగతులు, మరుగుదొడ్ల నిర్వహణ, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అదేవిధంగా పాఠశాల రికార్డులను, విద్యార్థుల హాజరుశాతాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేయాలని సూచించారు. అంతకుముందు గ్రామంలో గ్రామసభలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఏఎస్ఎం సుగుణ, పంచాయతీ కార్యదర్శి గుల్‌మహ్మద్, ఏపీఓ శ్యాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



నిరసన తెలియజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

కల్వకుర్తి టౌన్: సిద్దిపేటలో న్యాయవాది రవికుమార్‌పై పోలీసులు దాడి హేయమైన చర్య అని, దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కల్వకుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరమణ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన చేపట్టారు. భద్రాచలంలో న్యాయవాదికి బేడీలు వేసిన ఘటన మరవకముందే, పోలీసులు మరో న్యాయవాదిపై కఠినంగా వ్యవహరించటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల ఉదాసీనత, పర్యవేక్షణ లోపం వలనే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని, ఉన్నతాధికారులు అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌రాజ్, న్యాయవాదులు లక్ష్మణ శర్మ, లక్ష్మీనారాయణ, వెంకట్‌గౌడ్, కృష్ణయ్య, అమరేందర్, వెంకట్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లేష్, ప్రశాంత్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

ఆలయంలో భక్తుల శ్రమదానం



ఆలయం పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న భక్తులు

మన్ననూర్: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం ప్రాంగణంలో భక్తులు గురువారం శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఆలయాన్ని కాకతీయుల కాలంలో నిర్మించారని భక్తులు పేర్కొన్నారు. పురాతన ఆలయం కావడంతో తరుచుగా అపరిశుభ్రత నెలకొంటోందని దీంతో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు స్వచ్ఛందంగా శ్రమదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పులిజాల శేఖర్, మెండ్లీ ఈదయ్య, మహిళలు సంబు శోభ, జయమ్మ, సుమతి, ప్రభావతమ్మ, మంజుల, పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



నంబర్ ప్లేటు లేని వాహనాలను పట్టుకున్న పోలీసులు

తాడూరు: మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని ఎస్ఐ మహేష్ అన్నారు. గురువారం జిల్లా అధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేని ఎనిమిది వాహనాలను పట్టుకున్నారు. వారం రోజుల పాటు వాహనాల తనిఖీ చేపడుతామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఆంజనేయులు, చందు, వాహనదారులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: వచ్చే నెల 3, 4 తేదీలలో స్థానిక సింగిల్‌విండో ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే ఏఐటీయూసీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ కోరారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శిక్షణ తరగతులకు రాష్ట్ర నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తప్పెట కిరణ్‌కుమార్, కళావతి, కృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడిగా అనిల్‌నాయక్



వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గ్రామ పంచాయతీ పరిధి తుంకిబండతండాకు చెందిన మూడవత్ అనిల్‌నాయక్‌ను ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు మోతిలాల్ నాయక్ నియమాక పత్రం అందజేశారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని స్టేడియం గ్రౌండ్‌లో సబ్ జూనియర్ గర్ల్స్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకుడు చందు ముదిరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపాడు. ఆదివారం పోటీలు ముగుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రమంత్రి జూపల్లి కృష్ణారావు, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డిలు ప్రారంభిస్తారని తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలలకు నోటీసులు



అమ్రాబాద్: మండల కేంద్రమైన పదరలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలకు గురువారం మండల విద్యాధికారి బాలకిషన్ నోటీసులు అందజేశారు. పాఠశాలలను సందర్శించి పరిసరాలు, వసతులు తదితర అంశాలను పరిశీలించారు. తరగతి గదులు, ఆటస్థలం, వెంటిలేషన్, అర్హతకలిగిన బోధనా సిబ్బంది లేకుండా పాఠశాలలు నిర్వహిస్తున్నారని గుర్తించారు. వారం రోజుల్లో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని లేని యెడల చర్యలు తీసుకుంటామని యాజమాన్యాలను హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మైక్‌సెట్ అందజేత

నాగర్ కర్నూల్: జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1986–87 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థి అర్థం శరత్‌కుమార్ ఆర్థిక సహకారంతో జెడ్పీహెచ్ఎస్‌కు రూ.60వేల విలువగల మైక్‌సెట్ ను గురువారం హెచ్ఎం జి.శ్రీలతకు మిత్రులు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి.వంశీమోహన్, మధుసూదన్, శివయ్య, రాజేందర్ రెడ్డి, చంద్రశేఖర్, హరిబాబు, పూర్వ పాఠశాల ఉపాధ్యాయులు జగపతిరావు, భగవంతు రెడ్డి,గోపాలరెడ్డి, సి హెచ్ కృష్ణ,సుదర్శన్ గౌడ్,విష్ణుమూర్తి పాల్గొన్నారు.

బాలుడికి విముక్తి కల్పించండి

మన్ననూర్: అమ్రాబాద్ మండలం లక్ష్మాపూర్ (బీకే) తండాల్లో మేకల కాపరిగా మగ్గుతున్న ఆదివాసి చెంచు బాలుడిని సంబంధిత అధికారులు విముక్తి కల్పించాలని కుటుంబ సభ్యులు కోరారు. తండాకు చెందిన తాక్రూ మైనర్ బాలుడిని మేకల కాపరిగా పెట్టుకున్నాడు. రెండు రోజుల కిందట మూడు మేకలు తప్పిపోవడంతో యజమాని బాలుడిని చిత్రహింసలకు గురిచేశాడు. ఈ విషయమై తాక్రూతో ఫోన్‌లో వివరణ కోరగా బెదిరింపు ధోరణితో నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. ఇదిలా ఉండగా ఘటన గురించి సంబంధిత ఐటీడీఏ కార్యాలయం ఏఓ జాఫర్ ఉసేన్‌కు సమాచారం తెలవడంతో ఐటీడీఏ పీఓ రోహిత్‌రెడ్డికి సమస్యను వివరించారు. ఈ విషయమై అమ్రాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని పీఓ విలేకరులకు తెలిపారు.

మట్టి నమూనా సేకరణ

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఏఈఓ గోవిందు ఆధ్వర్యంలో ఓ రైతు పొలంలో మట్టి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారుల ఆదేశాలకు మేరకు పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మండలాన్ని ఎంపిక చేయడంతో మట్టి నమూనా సేకరించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే రైతుల పొలాల నుంచి 246 నమూనాలను శాంపిల్స్ తీసినట్లు తెలిపారు. మట్టి పరీక్షల కోసం జడ్చర్లలోని పరీక్ష కేంద్రానికి పంపిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శశికళ, భాస్కర్‌గౌడ్ తదితర రైతులు పాల్గొన్నారు.

అవకతవకలపై ఫిర్యాదు

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల నియామకాల్లో జరిగిన అవకతవకలపై గ్రామస్తులు గురువారం ఫిర్యాదు చేశారు. కస్తూర్బా విద్యాలయంలో కాంట్రాక్ట్ వంట మనిషి, నైట్ వాచ్‌మెన్ పోస్టులలో నియమించిన వారి నియామకాలు రద్దు చేసి నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని బీఆర్ఎస్ నాయకులు ప్రదీప్, వేంకటేష్, స్వరూప, మంజులలు ఎంపీడీఓ లక్ష్మీదేవికి వినతి పత్రం అందజేశారు.